


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 315 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 17 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :315 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 17 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




అమరావతిలో జగన్నాథ రథయాత్ర..

## బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

- రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర
- బంగారు చీపురుతో ఊడ్చి రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు
- ఆధ్యాత్మికతతోనే ఒత్తిడి దూరం అవుతుందన్న ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని ప్రకటన
- అమరావతి, పోలవరం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువు తరహాలో రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి చంద్రబాబు తన సేవను చాటుకున్నారు. అనంతరం జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగి యాత్రను ప్రారంభించారు.

- మిగతా 2లో



## ఏపీలో ఈ నెల 22న ‘తల్లికి వందనం’ నిధులు విడుదల...

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘తల్లికి వందనం’ పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఈ పథకం అమలు, మార్గదర్శకాల కోసం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం జీవో నెం.15, జీవో నెం.16 జారీ చేశారు. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 42,70,802 మంది తల్లులకు, వారి 67,47,190 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. జులై 22వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్లను తగ్గించి, వారి చదువులో తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తోంది.దగత విద్యా సంవత్సరం (2025-26) నుంచి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా

- మిగతా 2లో

- తల్లికి వందనం’ పథకానికి రూ.10,120.78 కోట్లు మంజూరు
- 42.70 లక్షల మంది తల్లులు, 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకు రూ.15,000 ఆర్థిక సాయం
- పాఠశాల నిర్వహణ కోసం రూ.2,000 మినహాయింపు, తల్లి ఖాతాలో రూ.13,000 జమ
- 2026-27 విద్యా సంవత్సరానికి పథకం అమలుకు ఉత్తర్వులు

## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు



- జగన్ అధ్యక్షతన వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్
- ప్రభుత్వ భూములను దోచిపెడుతున్నారని మండిపాటు
- అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20 వేలకు పైగా ఖర్చు చూపిస్తున్నారని ఆరోపణ
- ప్రతి రంగంలో మాఫియా రాజ్యమేలుతోందని విమర్శ

- మిగతా 2లో



## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

### కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని

- మిగతా 2లో



## డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

- మంగళ్‌హాట్‌లో డ్రగ్స్ ముఠాపై పోలీసుల దాడి
- ఎమ్మెల్సీ కుమారుడితో సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు ఐఏఎన్ఎస్ కథనం
- వారి నుంచి హ్యాష్ ఆయిల్, గంజాయి స్వాధీనం
- తన కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని ఖండించిన ఎమ్మెల్సీ
- కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నలుగురి కోసం గాలింపు

- మిగతా 2లో

## సొంత పార్టీ నేతపై వేటు..

### అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

- తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావు లేదన్న విజయ్
- ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని వెల్లడి
- అవినీతికి పాల్పడేవారికి రెండో ఛాన్స్ ఉండదని స్పష్టీకరణ

2లో



## న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

- న్యూజిలాండ్ దక్షిణ దీవిని వణికించిన భూకంపం
- రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైన తీవ్రత
- పశ్చిమ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ
- ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాలని అధికారుల సూచన
- తక్షణ ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారం లేదు

పెన్ పవర్ డెస్క్:న్యూజిలాండ్‌లో భూకంపం సంభవించింది. దేశంలోని దక్షిణ దీవిలో గురువారం 6.3 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పశ్చిమ తీర ప్రాంత ప్రజలు తీవ్ర

- మిగతా 2లో




## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- కుడంకుళం అణు కేంద్రం నుంచి సున్నితమైన డేటా ఏదీ లీక్ కాలేదని స్పష్టీకరణ
- ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై ఆందోళన అవసరం లేదని వెల్లడి
- గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం ఉండదని హామీ
- డేటా లీక్ కాంట్రాక్టర్ సర్వర్‌లో జరిగిందని తెలిపిన మంత్రి జితేంద్ర సింగ్

- మిగతా 2లో

## యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు..



### కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

- ఇంధన రంగ నిపుణుడైన కోరెట్స్కీని ఎంపిక చేసిన జెలెన్స్కీ
- కోరెట్స్కీ నియామకానికి ఆమోదం తెలిపిన ఉక్రెయిన్ పార్లమెంట్
- రక్షణ దళాల బలోపేతం, శీతాకాల సన్నద్ధతే ప్రధాన లక్ష్యాలు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు.. కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

రష్యాతో భీకర యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఉక్రెయిన్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ నూతన ప్రధానమంత్రిగా ఇంధన రంగ నిపుణుడు సెర్హీ కోరెట్స్కీ నియమితులయ్యారు. ఆయన నియామకానికి ఉక్రెయిన్ పార్లమెంట్ గురువారం ఆమోదముద్ర వేసింది. దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఈ రంగానికి చెందిన అనుభవజ్ఞుడికి ప్రధాని పగ్గాలు అప్పగించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని యూలియా స్విరిడెంకో తన పదవికి రాజీనామా చేయగా, ఆమె స్థానంలో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ 'నాఫ్టోగాజ్' సీఈఓగా పనిచేస్తున్న సెర్హీ కోరెట్స్కీ పేరును జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత ఉక్రెయిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా కోరెట్స్కీ నిలిచారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కోరెట్స్కీ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "ఉక్రెయిన్ రక్షణ దళాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడం, రక్షణ పరిశ్రమల అభివృద్ధిని వేగవంతం చేయడం, రాబోయే శీతాకాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం మా ప్రథమ కర్తవ్యం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వీటితో పాటు సామాజిక బాధ్యతలను నెరవేర్చడం, యూరోపియన్ యూనియన్‌లో చేరే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. 48 ఏళ్ల కోరెట్స్కీకి ఇంధన రంగంలో అపార అనుభవం ఉంది. అయితే, ఆయనకు గతంలో ఎలాంటి రాజకీయ పదవుల అనుభవం లేదు. రష్యా దాడుల నడుమ దేశ ఇంధన స్థిరత్వాన్ని కాపాడటంలో నాఫ్టోగాజ్ సీఈఓగా ఆయన కీలక పాత్ర పోషించారు.

# ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల...

- మొదటి పేజి తరువాయి

ఒక్కో బిడ్డకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

**నిధుల కేటాయింపు, చెల్లింపు విధానం**

ప్రతి విద్యార్థికి అందించే రూ.15,000 ఆర్థిక సహాయం నుంచి రూ.2,000 పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణ, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మినహాయిస్తారు. మిగిలిన రూ.13,000 నేరుగా అర్హులైన తల్లుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, తల్లులను ఆర్థికంగా ప్రోత్సహించడం కూడా ప్రభుత్వ ఉద్దేశం.

**పథకానికి అర్హతలు ఇవే:**

'తల్లికి వందనం' పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన అర్హత నిబంధనలను నిర్దేశించింది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు (గ్రా+వాజె) శాఖ ఆరు దశల ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,000, పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 మించకూడదు.

భూమి: మాగాణి అయితే 3 ఎకరాల లోపు, మెట్టభూమి అయితే 10 ఎకరాల లోపు ఉండాలి. రెండూ కలిపి ఉన్నా 10 ఎకరాల పరిమితికి లోబడే ఉండాలి.

వాహనం: కుటుంబంలో ఎవరి పేరు మీదా నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. అయితే, టాక్సీ, ట్రాక్టర్, ఆటోలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.

విద్యుత్ వినియోగం: కుటుంబం నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లకు మించరాదు. దీని కోసం గత 12 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటారు.

ఆస్తి: పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబానికి 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో మున్సిపల్ ఆస్తి ఉండకూడదు.

ప్రభుత్వ ఉద్యోగం: కుటుంబ సభ్యుల్లో ఎవరూ కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగిగా ఉండరాదు. ప్రభుత్వ పింఛనుదారులకు కూడా ఇది వర్తించదు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిర్దేశిత ఆదాయ పరిమితి లోపు జీతం తీసుకునే వారికి మినహాయింపు ఉంటుంది.

ఆదాయ పన్ను: కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు కూడా ఆదాయపు పన్ను చెల్లింపుదారుగా ఉండకూడదు.

చదువు: విద్యార్థులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల/జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే కోర్సులకు ఈ పథకం వర్తించదు.

**ప్రత్యేక నిబంధనలు, చెల్లింపులు**

అనాథలు: స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలల్లో చేరిన అనాథలు, వీధి బాలలు ఈ పథకానికి అర్హులే. సంబంధిత జిల్లా కలెక్టర్ వారి తరఫున గార్డియన్-ఆపరేటెడ్ బ్యాంకు ఖాతాను తెరిచి, నిధులు సక్రమంగా అందేలా పర్యవేక్షిస్తారు.

ఆర్టీఈ విద్యార్థులు: విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల విషయంలో, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును నేరుగా పాఠశాల యాజమాన్యానికి చెల్లిస్తారు. ఆ మొత్తం పోగా ఏమైనా మిగిలితే, దానిని తల్లి ఖాతాలో జమ చేస్తారు.

ఇతర స్కాలర్‌షిప్‌లు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందుతున్నట్లయితే, ఆ పథకం కింద వచ్చే మొత్తాన్ని మినహాయించి, మిగిలిన బ్యాలెన్స్ మొత్తాన్ని 'తల్లికి వందనం' కింద చెల్లిస్తారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- మొదటి పేజి తరువాయి

నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..

- స్టెనో నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు ఉద్యోగ ప్రస్థానం
- ఉమ్మడి రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు పోస్టింగ్‌ల వివరాలు
- వరుస బదిలీలతో సాగిన అధికారిక ప్రయాణం
- అక్రమాస్తులపై వస్తున్న ఆరోపణలు.. నిజానిజాలపై ప్రశ్నలు
- పత్రాలు, ఆధారాల సేకరణలో పెన్ పవర్ ప్రత్యేక బృందం

**ఏలూరు జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన ఆరోపణలపై పెన్ పవర్ నిర్వహిస్తున్న ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం కథనాల శ్రేణిలో ఎపిసోడ్-3 .**

**స్టెనోగా ప్రారంభమైన ఉద్యోగ జీవితం.. సబ్ రిజిస్ట్రార్‌గా వరుస పోస్టింగులు.. ఇప్పుడు వక్ర మార్గంలో కోట్ల విలువైన ఆస్తులపై వస్తున్న ఆరోపణలు. ఇవన్నీ చట్టబద్ధ ఆదాయంతోనే సమకూరాయా? లేక ఇతర ఆదాయ వనరులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం పెన్ పవర్ ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం ఆస్తుల చిట్టా దుమ్ము దులుపుతుంది.. ఈ క్రమంలో విస్తుపోయే నిజాలు ఒక్కటిగా వెలుగు చూస్తున్నాయి.** ఎడిటర్, పెన్ పవర్ జూలై 16:

ఈ ఎపిసోడ్‌లో సంబంధిత అధికారి ఉద్యోగ ప్రస్థానం, ఆయనపై వస్తున్న ఆస్తుల ఆరోపణలు, వాటి వెనుక ఉన్న ప్రశ్నలను పరిశీలిస్తోంది. సమాచారం ప్రకారం వి. రాఘవేంద్ర ప్రసాద్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్టెనోగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు ప్రారంభించిన ఆయన, అనంతరం పదోన్నతితో 2017లో (ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలో) అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో హైదరాబాద్ ఎస్.ఆర్. నగర్ డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. తర్వాత 2018లో చిట్యాల సబ్ రిజిస్ట్రార్‌గా తొలి పోస్టింగ్ పొందారు. అక్కడ 2018--2019 వరకు విధులు నిర్వహించిన అనంతరం, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ని ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ 2019 నుంచి 2022 వరకు పనిచేశారు.

ఆ తర్వాత 2022 నుంచి 2024 వరకు అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం 2024లో భీమడోలు సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం కొనసాగుతున్నారు.

ఇంతవరకు ఉద్యోగ ప్రస్థానంలో, ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పేరుతో కాకుండా కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై కూడా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ నగరంలో కుమారుడి పేరుతో హోటల్, తండ్రి పేరుతో ఇతర ఆస్తులు, బంధువుల పేర్లపై మరిన్ని ఆస్తులు ఉన్నాయనే సమాచారం పెన్ పవర్ పరిశీలనలోకి వచ్చింది. అయితే ఈ ఆస్తులన్నీ చట్టబద్ధ ఆదాయంతోనే సమకూరాయా? లేక ఇతర ఆదాయ వనరులు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత పత్రాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, ఇతర ఆధారాలను సేకరించి వాస్తవాలను వెలికితీసేందుకు పెన్ పవర్ ప్రత్యేక దర్యాప్తు కొనసాగిస్తోంది.

**ఎపిసోడ్ -4లో..**

**విజయవాడలో హోటల్ ఎవరి పేరుతో కొన్నారు..? పెట్టుబడి ఎంత..?**

**రిజిస్ట్రేషన్ పత్రాలు ఏమి చెబుతున్నాయి..?**

**చదువుతూనే ఉండండి పెన్ పవర్ తెలుగు దినపత్రిక**

# రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు

వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్పీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?" అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

# సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.

సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు.

ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ రెండు అంశాల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల భద్రతకు, పురోగతికి ఎలాంటి విఘాతం కలగదని ఆయన భరోసా ఇచ్చారు.

ఇటీవల 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ గ్రూప్, కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 19,000 ఫైళ్లను డార్క్ వెబ్‌లో బహిర్గతం చేసినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 14.3 జీబీ డేటా కలిగిన ఈ ఫైళ్లలో ప్లాంట్ బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, ప్లాంట్‌కు సంబంధించిన ఎటువంటి సున్నితమైన సమాచారం లీక్ కాలేదని, వ్యూహాత్మక భద్రతకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పారు. ఈ డేటా లీక్ అనేది ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకరికి చెందిన థర్డ్-పార్టీ సర్వర్ నుంచి పాక్షికంగా జరిగినట్లు గుర్తించామని, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని వివరించారు. మరోవైపు, గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న గ్రూప్ 'ఏ' శాస్త్రవేత్తలు, సాంకేతిక ద సిబ్బంది రాజీనామాలను తక్షణమే ఆమోదించవద్దని అంతరిక్ష విభాగం జులై 14న ఒక మెమో జారీ చేసింది. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయమని, ఉన్నత స్థాయిలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చాలామంది వస్తుంటారు, పోతుంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ సైతం ఈ నిర్ణయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

# న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

- మొదటి పేజి తరువాయి

భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్ రీజియన్‌లోని టె అనౌకు 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా మిల్ఫోర్డ్ సౌండ్ నుంచి ప్యూసెగుర్ పాయింట్ వరకు ఉన్న దక్షిణ దీవి పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు తక్షణమే ఎత్తైన ప్రదేశాలకు లేదా లోతట్టు ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నడిచి, పరిగెత్తి లేదా సైకిళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్ట్రేలియన్, పసిఫిక్ టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులో న్యూజిలాండ్ ఉండటంతో ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. 2011లో సంభవించిన క్రైస్ట్‌చర్చ్ భూకంపం 185 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ప్రధాన ఆస్తి నష్టం గానీ జరిగినట్లు ఇంకా సమాచారం అందలేదని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని జాతీయ అత్యవసర నిర్వహణ ఏజెన్సీ (ఎన్ఈఎంఏ) అధికారులు తెలిపారు.

# డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. నగరంలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో పోలీసులు జరిపిన దాడిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పి. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, తన కుమారుడు డ్రగ్స్ వినియోగించలేదని, అతడిని అరెస్ట్ చేయలేదని ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ కథనం మేరకు.. బుధవారం రాత్రి మంగళ్‌హాట్‌లో ఓ ముఠా గంజాయి, హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి సేవిస్తోందని తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, యునిత్‌లను పట్టుకోగా, మరో నలుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల హ్యాష్ ఆయిల్, 22 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న సోని, వంశీ, మనోజ్, తులిజాల కోసం గాలిస్తున్నారు.

కాగా, ఈ ఆరోపణలను ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తన కుమారుడు భరత్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నాడని, అతడిని అరెస్ట్ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. "ఒక కామన్ ఫ్రెండ్ ఫోన్ కాంటాక్ట్ లిస్ట్‌లో నంబర్ ఉండటంతో, డ్రగ్స్ కేసుకు సంబంధించి విచారణకు సహకరించాలని పోలీసులు మా ఇంటికి వచ్చారు. విచారణలో నా కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని తేలింది. అతడిని అరెస్ట్ చేయలేదు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో తరచూ డ్రగ్స్ కేసులు నమోదవుతుండటంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు.

### అమరావతిలో జగన్నాథ రథయాత్ర..

# బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శుభసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# వ్యాయామశాలలో వినూత్నంగా జగన్నాధుని పూజలు



**గాజువాక: పెన్ పవర్, జులై 16:**పూరీ జగన్నాద రథయాత్ర సందర్భంగా విశాఖ జిల్లా గాజువాక బిహెచ్పివి కూడలి సమీపంలోని ఆర్ కె షేప్ ఫిట్నెస్ సెంటర్ వ్యాయమశాలలో గురువారం వినూత్నంగా జగన్నాదుని పూజలు నిర్వహించారు. జిమ్ వ్యవస్థాపకుడు బర్ల రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో భాగంగా వ్యాయామ సామాగ్రితో జగన్నాధుని ప్రతిమను నెలకొల్పి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తాము నిత్యం శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు వినియోగించే వ్యాయామ సామాగ్రిని జగన్నాధ స్వామి రూపంలో పూజించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తమ వ్యాయామశాలలో ప్రతీ ఒక్కరికీ శారీరక దారుడ్యంతో పాటు సనాతన భక్తితత్వాన్ని అలవరచటమే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిమ్ సభ్యులను భాగస్వామ్యం చేసి వారి సహకారంతో స్వామిరూపాన్ని తయారుచేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సాయి, హేమాంకిత, చంద్రిక, అనిల్, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# గంజాయిపై ఉక్కుపాదం.. డ్రోన్ నిఘాతో ఫలితం

- జిల్లాలో అక్రమ రవాణాపైనా కఠిన చర్యలు.. గంజాయి రహిత జిల్లానే లక్ష్యం
- 2.55 లక్షల మందికి 'సంకల్పం' ద్వారా అవగాహన: కలెక్టర్ నిషాంతి



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు/గూడెంకొత్తవీధి, పెన్ పవర్, జూలై 16:** అల్లూరి సీతారామరాజు జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి తెలిపారు. డ్రోన్ల నిఘా, క్షేత్రస్థాయి తనిఖీలు, ప్రజల భాగస్వామ్యంతో గతంలో 357 గ్రామాల్లో సాగిన గంజాయి సాగు ప్రస్తుతం పూర్తిగా 'సున్నా' స్థాయికి చేరిందని వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎన్‌కార్డ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి సాగు, నిల్వ, రవాణాపై సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ప్రధాన, అంతర్గత రహదారులపై శాశ్వత, తాత్కాలిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, డైనమిక్ వాహన తనిఖీల ద్వారా అక్రమ రవాణాను అడ్డుకుంటున్నట్లు చెప్పారు.డ్రోన్ల ద్వారా కొండ ప్రాంతాల్లో వైమానిక సర్వేలు, పోలీసుల భౌతిక తనిఖీలు, గ్రామ సచివాలయాల ద్వారా సమాచార సేకరణ, స్టేషన్ హౌస్ అధికారుల రహస్య సమాచార వ్యవస్థతో గంజాయి సాగును గుర్తించి పూర్తిగా నిర్మూలించగలిగామని వివరించారు.జిల్లాలో 114 గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించి, గంజాయి కేసులతో సంబంధమున్న 47 మంది పాత నేరస్థులకు కౌన్సెలింగ్ అందించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో 10 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నిరంతరం పనిచేస్తోందన్నారు. గంజాయి అక్రమ రవాణా నిరోధక చట్టం కింద 32 మందిని గుర్తించగా, 14 మందికి ఉత్తర్వులు జారీ చేసి, వాటిలో 10 ఉత్తర్వులను ఇప్పటికే అమలు చేసినట్లు వెల్లడించారు. అలాగే 554 మందిపై సస్పెక్ట్ షీట్లు తెరిచామని తెలిపారు.ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 2,618 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 2,55,194 మందికి చైతన్యం కల్పించినట్లు చెప్పారు. ఏప్రిల్ నుంచి జూన్-2026 వరకు మాత్రమే 593 కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పోలీసుల చొరవతో పంచాయతీల్లో గంజాయికి వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛందంగా తీర్మానాలు చేస్తున్నారని తెలిపారు. పాడేరు సబ్‌డివిజన్‌లో 102 పంచాయతీల పరిధిలోని 396 గ్రామాలు, చింతపల్లి సబ్‌డివిజన్‌లో 228 పంచాయతీల పరిధిలోని 280 గ్రామాలు కలిపి మొత్తం 330 పంచాయతీల పరిధిలోని 676 గ్రామాలు గంజాయికి వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానాలు చేశాయని చెప్పారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలు, ప్రతి శనివారం నిర్వహించే 'ఆనందం' కార్యక్రమం, ఆగస్టు 15 వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాటలు, నాటికల ద్వారా ప్రజలను చైతన్యపరచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, జిల్లా ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ జి. దేముళ్లు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. అప్పన్నతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పల్లె బాటలో ఈగల్ టీం పోలీస్ శాఖ



**జి.మాడుగుల.పెన్ పవర్.జులై(16)** జి మాడుగుల మండలం కులుపాడు గ్రామంలో నేడు ఈగల్ టీం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులతో గంజాయి పంట పండిస్తే వచ్చే అనర్ధాలు గురించి జరగబోయే పరిణామాలు గురించి వివరిస్తూ సీజన్లకు తగిన ప్రత్యామ్నాయ పంటలను చేసుకోవాలని యువత గంజాయి జోలికి పోవద్దని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈగల్ టీం మరి జి.మాడుగుల పోలీస్ శాఖ పాల్గొన్నారు

## దక్షిణ తీర రైల్వేలో ఘన వ్యర్థాల నిర్వహణపై జిఎం సమీక్ష




**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 16:**దక్షిణ తీర రైల్వే (ఎస్‌సిఒఆర్) పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయడంపై జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్టేషన్లు, కార్యాలయాలు, రైల్వే కాలనీలు, ఇతర స్థావరాల్లో శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, వ్యర్థాలను మూలం వద్దనే వేరు చేయాలని, పర్యావరణ మార్గదర్శకాలకు అనుగుణంగా సేకరణ, ప్రాసెసింగ్, పారవేయడం చేపట్టాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా క్షేత్ర స్థాయి యూనిట్లలో అవగాహన కార్యక్రమాలు పెంచాలని, పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని జిఎం సూచించారు. రైల్వే ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించడం లక్ష్యంగా వ్యర్థాల నిర్వహణ నిబంధనలను కఠినంగా పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని విభాగాల మధ్య సమన్వయంతో కార్యక్రమాలను వేగంగా అమలు చేయాలని ఆయన కోరారు.

ఈ సమీక్ష సమావేశంలో ఎస్‌సిఒఆర్ ప్రధాన కార్యాలయ ప్రిన్సిపల్ విభాగాధిపతులు, నాలుగు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు పాల్గొన్నారు. ప్రస్తుత వ్యవస్థను సమీక్షించి, జోన్ మొత్తంలో వ్యర్థాల నిర్వహణను మెరుగుపరిచే చర్యలపై చర్చించారు.

# వైభవంగాశ్రీ జగన్నాథ స్వామి కళ్యాణ రథయాత్ర

- జై జగన్నాథ్ నినాదాలుతో కొనసాగిన ఆధ్యాత్మిక శోభాయాత్ర
- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించిన :దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్
- భారీగా తరలివచ్చిన భక్తులు-టౌన్ కొత్త రోడ్డు నుండి ప్రారంభమైన రథయాత్ర

**విశాఖ తూర్పు, పెన్ పవర్, జులై 16:** జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా టౌన్ కొత్త రోడ్డు వద్ద జగన్నాథ స్వామి రథయాత్ర, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్. టౌన్ కొత్త రోడ్డు వద్ద నిర్వహించిన శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామి వారి కల్యాణ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని, ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు.

టౌన్ కొత్త రోడ్డు నుంచి పూర్ణా మార్కెట్ వరకు రథయాత్రలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు భక్తులతో కలిసి కాలినడకన పాల్గొన్నారు.సందర్భంగా భక్తులు "జై జగన్నాథ" నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

మేలతాళాలు, మంగళ వాయిద్యాలు, సాంప్రదాయ సాంస్కృతిక నృత్యాలు, భజన బృందాల ప్రదర్శనలతో రథయాత్ర శోభాయమానంగా కొనసాగింది. చిన్నా పెద్దా తేడా లేకుండా వేలాదిమంది భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి రథయాత్రను దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తజనం తరలిరావడంతో రథయాత్రకు విశేష ఆదరణ లభించింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, జగన్నాథ స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను, సనాతన సంప్రదాయాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలోఆలయ ఈవో, కూటమి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, బఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనంతరం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర వేడుకలో గ్రీన్ పార్క్ వద్ద పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు..








# రెస్టారెంట్, రోగాలకు చిరునామా.

- మురుగు కూపంగా మారిన స్పైసీ రెస్టారెంట్ పరిసరాలు.
- దుర్గంధం, దోమల బెడదతో స్థానికుల నరకయాతన.
- నిబంధనలు గాలికి వదిలేసిన వైనం, పట్టించుకోని అధికార గణం.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 16.** పేరుకు 'స్పైసీ' రెస్టారెంట్, కానీ అక్కడి పరిసరాలు మాత్రం రోగాలకు నిలయంగా మారాయి. నాణ్యమైన ఆహారం అందించాల్సిన యాజమాన్యం, పారిశుధ్యాన్ని గాలికి వదిలేయడంతో ఆ ప్రాంతమంతా మురుగు కూపాన్ని తలపిస్తోంది. చింతపల్లి మండల కేంద్రంలోని స్పైసీ రెస్టారెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యం చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల పాలిట ప్రాణసంకటంగా మారింది. రెస్టారెంట్ యాజమాన్యం ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందో ఆ పరిసరాలను గమనిస్తే పరిస్థితి తీవ్రత ఇట్టే అర్థమవుతుంది. వాడి పారేసిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కుళ్ళిపోయిన ఆహార వ్యర్థాలను ఎక్కడికక్కడే బహిరంగంగా వదిలేశారు. కనీస డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ మురుగు నీరంతా అక్కడే నిలిచిపోయి ఒక కలుషిత కుంటలా తయారైంది. ఈ మురుగు కూపానికి ఆనుకుని అనేక గృహ సముదాయాలు ఉన్నాయి. కుళ్ళిన వ్యర్థాల కారణంగా ఆ ప్రాంతమంతా భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. నిల్వ ఉన్న మురుగు నీటితో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తుండటంతో స్థానిక కుటుంబాలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నాయి. ఈ కలుషిత వాతావరణం వల్ల ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు లబోదిబోమంటున్నారు. ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ, పంచాయతీ నిబంధనల ప్రకారం,రెస్టారెంట్లు తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య వాహనాలకు అప్పగించాలి. అలాగే మురుగునీరు నిల్వ ఉండకుండా గ్రీజ్ ట్రాప్స్‌తో కూడిన క్లోజ్డ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో తరచుగా పెస్ట్ కంట్రోల్ చేయించాలి. కానీ, ఇవేవీ పట్టని స్పైసీ రెస్టారెంట్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేకపోవడం గమనార్హం. కళ్లెదుటే ఇంతటి పారిశుధ్య లోపం కనిపిస్తున్నా, ప్రజలు రోగాల బారిన పడుతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు గాని, వైద్యాధికారులుగాని చూసీచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న రెస్టారెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఆ వ్యర్థాలను తొలగించి తమకు ఈ దుర్గంధ కోపం నుంచి విముక్తి కల్పించాలని చింతపల్లి వాసులు వేడుకుంటున్నారు.



## జీకే వీధిలో పోలీస్--సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వైభవం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో పోలీస్ శాఖ, సీఆర్పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ పూరి జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై సురేష్ ఉత్సాహంగా రథాన్ని లాగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.అనంతరం సీఆర్పీఎఫ్ జవాన్లు, స్థానిక పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ పోలీస్ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రలో పాల్గొన్నారు. రథయాత్ర ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో రథాన్ని అనుసరించారు. భక్తుల జైజైధ్వానాలు, భజనలు, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య రథయాత్ర వైభవంగా సాగింది.ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు, ఏపీఎస్పీ పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. రథయాత్ర ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## గిరిజన గొంతు వినిపిద్దాం మన. హక్కులను సాధిద్దాం..!

- ఆదివాసీల హక్కుల పరిరక్షణ ఉద్యమాలకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు



**హుకుంపేట పెన్ పవర్ జూలై 16 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గ హుకుంపేట మండలం. ఈనెల 17వ తారీఖున పాడేరులో జరుగుతున్న ఐక్య గిరిజన సమైక్య ర్యాలీలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పలు డిమాండ్లతో సంపూర్ణ మద్దతుతో ఆదివాసి గిరిజన సంఘాలకు మద్దతు తెలుపుతుందని ఈ సందర్భంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.


ఆదివాసీ సంఘాల ప్రధాన డిమాండ్లు:

1. 1/70చట్టం పటిష్టంగా అమలుచేయాలి
2. జీవో నంబర్ .3కకు ప్రత్యామ్నాయంగా
3. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసి స్థానిక ఆదివాసులకు సత శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
3. అల్లూరి సీతారామరాజు జిల్లా ను జోన్ 1లోనే కొనసాగించాలి అంతేకాకుండా పలు సమస్యల పరిస్కారానికి ఆదివాసీ సంఘాలు తేదీ 17.7.2026 శుక్రవారం నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు గిరిజన శంఖారావం చేపట్టిన భారీ ర్యాలీ, సభను జయప్రదం చేయాలని ఆదివాసి సంఘాలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్,ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంది.కావున ఎన్ టీ ఏ సభ్యులు, నాయకులు సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొనవలసిందిగా ఎన్ టి ఏ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు బోయపల్లి సింహాచలం కోరారు

19న విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వకేషన్ ఆదివాసీ సంఘాల డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఐదుగురు ఎమ్మెల్సీ. లు వేపాడ చిరంజీవి రావు, భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి పెరబత్తుల రాజశేఖర్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కంచర్ల శ్రీకాంత్ లకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఎన్ టి ఏ. అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలసి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుంది. అని ఆయన తెలియజేశారు?

## అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా టీవీ బాలమురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ నిషాంతిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 16:**అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ టి. నిషాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సేవలు అందించే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఇంతకుముందు ఆయన శ్రీకాకుళం జిల్లాలో జిల్లా వైద్యాధికారిగా విధులు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన ఆయన, తిరిగి విధుల్లో చేరిన తర్వాత బదిలీపై అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా నియమితులైనట్లు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణ పనులు వేగవంతం చేయాలి



## అనుమానాస్పద కేసుల తగ్గింపుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రశంసలు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 16:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమం పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అమలు తీరును జిల్లా ఎన్నికల యంత్రాంగం వివరించింది.జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ సమీక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు.సమీక్షలో ఒకే వ్యక్తికి బహుళ ఓట్లు ఉన్నట్లు గుర్తించిన కేసుల పునఃధృవీకరణ, ఓటర్ల వివరాలు నమోదు కాని కేసులు, అనుమానాస్పద నమోదులు, ఓటర్ల ఫొటోల నవీకరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, బూత్ స్థాయి అధికారులతో నేరుగా సమీక్ష తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనుమానాస్పద నమోదులను 2,49,298 (29.87 శాతం) నుంచి 48,015 (9.87 శాతం)కు తగ్గించడంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల యంత్రాంగాన్ని అభినందించారు. మిగిలిన అనుమానాస్పద కేసులను బూత్ స్థాయి అధికారుల మొబైల్ యాప్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఒకే వ్యక్తికి బహుళ ఓట్లు ఉన్నట్లు గుర్తించిన ఓటర్ల సంఖ్య 34,536 నుంచి 29,636కు తగ్గినట్లు సమీక్షలో వెల్లడైంది. మిగిలిన కేసులను బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, నిజమైన ఓటరుగా నిర్ధారణ అయినట్లయితే సంబంధిత ఎన్నికల అధికారులకు నివేదించాలని సూచించారు. అలాగే ఎన్నికల అధికారులు బూత్ స్థాయి అధికారులతో నిరంతరం ఫోన్ ద్వారా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.ఒకే వ్యక్తికి బహుళ ఓట్లు ఉన్నట్లు అనుమానిస్తున్న 7,362 కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆధార్ వివరాల ఆధారంగా ఎన్నికల సంఘం ప్రత్యేక విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని, 85 సంవత్సరాలు పైబడిన అనుమానాస్పద కేసులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధృవీకరించబడినవి లేదా వివరాలు సేకరించలేనివిగా నమోదు చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఇంకా 21,117 ఓటర్ల వివరాలు నమోదు కాని కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. వాటిలో అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో 16,371, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 4,746 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. వీటి పరిష్కారంపై సంబంధిత ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారులను ఆదేశించారు.

# పసుపు సాగులో ఆధునిక పద్ధతులను వినియోగించాలి.

వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 16.** విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ (టాటా ట్రస్ట్) మరియు ఎల్ఐసి హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా అమలు చేస్తున్న పసుపు రైతుల కొరకు సామూహిక కోత అనంతర సౌకర్యాల అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా చింతపల్లి మండలం, గర్రెల గెడ్డ గ్రామంలో గురువారం పసుపు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు పసుపు సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైజ్డ్ బెడ్ పద్ధతిలో సాగు చేయడం ద్వారా నీటి నిల్వ తగ్గి దుంప కుళ్ళు వంటి వ్యాధులను నివారించవచ్చని, నేలలో గాలి ప్రసరణ మెరుగుపడి మొక్కల ఎదుగుదలతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

అధిక నాణ్యత కలిగిన తల్లి దుంపలను విత్తనంగా ఉపయోగించాలని, కంది, మొక్కజొన్న వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందడంతో పాటు నేల సారాన్ని మెరుగుపరచవచ్చని సూచించారు.

ట్రైకోడెర్మాను సేంద్రియ ఎరువులతో కలిపి వినియోగించడం వల్ల నేలలోని హానికర శిలీంధ్రాలను నియంత్రించి దుంప కుళ్ళు, వేరుకుళ్ళు వంటి వ్యాధులను తగ్గించవచ్చని తెలిపారు. అలాగే జీవామృతం తయారీ, వినియోగంపై రైతులకు ప్రయోగాత్మకంగా వివరించి, దీని వాడకం ద్వారా నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని చెప్పారు.

అనంతరం రైతులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది నవరాజు, మణిచందన, బాలరాజు పాల్గొన్నారు.

## 1/70 ఉల్లంఘనకు సహకరిస్తున్న అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.



సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 16.**50 సంవత్సరాల నుంచి 1/ 70 చట్టం ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి అప్పట్నుంచి ఉన్న అధికారులందరి పైన క్రిమినల్ కేసులు పెట్టాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు, గురువారం సిపిఎం పార్టీ కార్యకర్తలతో కలిసి ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుతో జీకే వీధి మండలం, జర్రెల బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల గిరిజనులతో సభకు సంబంధించిన కరపత్రాన్ని గురువారంవిడుదల చేశారు.అనంతరం మాట్లాడిన చిన్నయ్య పడాల్, గత 50 సంవత్సరాల నుంచి గిరిజన ప్రాంతంలో యదేచ్ఛగా భూ బదలాయింపు 1/70 చట్టం ఉల్లంఘన జరుగుతూనే ఉన్నాయని అన్నారు. చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజన నేతరుడు వ్యాపారం నిమిత్తం ఈ ప్రాంతానికి వలస వస్తే అద్దెకి తీసుకొని ఉండాలి లేదా ప్రభుత్వ భూమిలో కట్టుకుంటే వ్యాపారం అనంతరం మళ్లీ తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పి వెళ్ళిపోవాలి అంతేకానీ గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని స్థలం కొనుగోలు చేసి స్థిర నివాసం కట్టుకునే అవకాశం లేదని చట్టం చెపుతున్నప్పటికీ బహుళ అంతస్థులు కడుతున్నారని ఎద్దేవా చేశారు. దీనికి ఎవరు అనుమతులు ఇచ్చారనిమండిపడ్డారు.గిరిజన ప్రాంతంలో కార్యదర్శి, వీఆర్వో లేదా తాసిల్దార్, పట్టణ ప్రాంతంలో మున్సిపల్ అధికారుల దగ్గర( ఎన్ ఓ సి ) నో అభ్యక్షన్ సర్టిఫికెట్ తీసుకొని ఇల్లు కట్టుకోవలసి ఉన్నప్పటికీ గిరిజన ప్రాంతంలో అవేమి పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయని పట్టించుకోవలసిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని ఇప్పుడే కాదు గత 50 సంవత్సరాల నుంచి ఇదే తంతు జరుగుతుందని అన్నారు. చట్టం ప్రకారం గిరిజనేతరుడు ఇసుక ఇటుకతో ఇల్లు కట్టకూడదని చట్టాల్లో ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో దర్జాగా కట్టేస్తున్నారని అన్నారు. ఇల్లు కట్టుకున్నాక కరెంటు మీటర్ ఇంటి పన్ను ఆధార్ కార్డు రేషన్ కార్డు ఓటు హక్కు అన్ని కలిగిన తర్వాత హక్కుదారున్ని అనకపోతే ఎవరిది అంటారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాభద్రాచలం గిరిజన ప్రాంతంలో 100కి 80% మంది గిరిజన నేత రులు నివాసం ఉంటున్నారని ఇల్లులతోపాటు భూములు కూడా కొనుగోలు చేశారని ఆ భూములు తమ పేర్ల మీద మార్చుకోవడం కోసం చట్టాన్ని సవరించాలని చెప్పి కోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. అందుకే 50 సంవత్సరాల నుంచి ఉన్న అధికారులు అందరిపైనా క్రిమినల్ లేదా అట్రాసిటీ కేసులు పెట్టి గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని పాలక ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పేరుకే గిరిజన చట్టాలు ఉన్నాయని ఆ చట్టాలు అమలు చేయాలని చెప్పి పోరాటం చేస్తుంటే ఉక్కు పాదంతో ప్రభుత్వాలు అలసివేస్తున్నాయని ప్రభుత్వ విధానాలే ఈ వలసలకి కారణమైందని అన్నారు. పంచాయతీరాజ్ ఎక్స్టెన్షన్ షెడ్యూల్ ఏరియా (పేసా ) గ్రామ సభలకు ఉన్న అధికారాలన్నీ ఏ ఒక్కటి అమలు చేయలేదని ఐటీడీఏలో పేసా కమిటీ సభ్యులకి ఒక రోజు సమావేశపరిచి ఏం తెలియజేశారో తెలియదని మండిపడ్డారు. అధికారులకే గిరిజన చట్టాలు హక్కుల పైన స్పష్టత లేదని ఆరోపించారు. బహుళ అంతస్థులు నిర్మించుకొని విశాలమైనటువంటి పెద్దపెద్ద బళ్ళు కొనుగోలు చేసి ఉన్నటువంటి గిరిజన నేతరుపైన ఏసీబీ విచారణ నిర్వహిస్తే ఆదాయం సంపద ఎక్కడి నుంచి వస్తుందో తెలిసిపోతుందని అధికారులను కోరారు. పేరుకే ఏజెన్సీ గిరిజన ప్రాంతం అయినప్పటికీ, మారుమూల గ్రామాలలో గిరిజనులు గృహాలను నిర్మించుకుంటే జిల్లా కేంద్రం, మండల కేంద్రం, ప్రధాన కూడళ్ళలో గిరిజనేతరుల బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్ దర్శనమిస్తున్నాయన్నారు. 1/70 అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు అనడానికి ఈ ఒక్క నిదర్శనం చాలన్నారు.ఈనెల 18న జీకే వీధి మండలం జర్రిల పంచాయతీ అసశీపల్లి, మిట్టల పనుకు కొండపైన జరిగే బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల గిరిజనుల సభను జయప్రదం చేయాలని ప్రభావిత ప్రాంతాలకు తరలి రావాలని గిరిజనులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జికే విధి మండల నాయకులు కోర్ర బాలయ్య, బాబురావు, బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల కన్వీనర్ కోరాబు బోదయ్యపడాల్, గొల్లూరి రాంబాబు పాల్గొన్నారు.

## వృత్తి విద్య నైపుణ్యాల ద్వారా భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చు.

- తాజంగి కేజీబీవీలో ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం.
- ప్రధానోపాధ్యాయురాలు కె. పద్మ.




**చింతపల్లి పెన్ పవర్ జూలై 16.**మారుమూల ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారికి వృత్తి విద్యా నైపుణ్యాలను అందించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు నిర్మించడం సాధ్యమవుతుందని మండలం లోని తాజంగి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మ స్పష్టం చేశారు. స్థానిక పాఠశాల ప్రాంగణంలో బుధవారం 'ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వృత్తి విద్య ఆవశ్యకతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకూడదన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆధునిక సాంకేతికతతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలను అందిపుచ్చుకున్నప్పుడే సులువుగా రాణించగలరని ఉద్ఘాటించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యమే వారి భవిష్యత్తుకు బలమైన వంతెన లాంటిదని, పాఠశాల దశ నుంచే వృత్తి విద్యను అభ్యసించడం వల్ల భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ముఖ్యంగా బాలికలు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో స్వయం ఉపాధి సాధించి, ఆర్థికంగా తమ సొంత కాళ్లపై తాము నిలబడటానికి మార్గం సుగమమవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. వృత్తి విద్యా విభాగపు అధ్యాపకులు ఎం.సాయి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులకు చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు సైతం తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఈ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు పద్మ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొలెరో వాహనం బోల్తా.. తప్పిన పెను ప్రమాదం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జెర్రీల పంచాయతీ పరిధిలోని పనసపల్లి గ్రామ సమీపంలో గురువారం బొలెరో వాహనం బోల్తా పడింది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ పనులకు అవసరమైన ఐరన్, సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న వాహనం చిరుజల్లుల కారణంగా రహదారి జారుడుగా మారడంతో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# నాతవరంలో ఎంపీ చింతకాయల విజయ్ ముమ్మర పర్యటన....

- కూటమి శ్రేణుల నుంచి అపూర్వ స్వాగతం..
- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమని స్పష్టం......
- రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్......

**నాతవరం,పెన్ పవర్ (జూలై 16):** రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం మండలంలో గురువారం ఎంపీ చింతకాయల విజయ్ ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.పర్యటనకు ముందు నర్సీపట్నంలోని శ్రీ బాలవినాయక స్వామి, మరిడితల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ విజయ్, అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి నాతవరం మండలానికి చేరుకున్నారు.మండల సరిహద్దు బెన్నవరం వద్ద వందలాది వాహనాలతో, నాతవరం పెట్రోల్ బంక్ వద్ద వేలాది మంది కార్యకర్తలతో ఎంపీ విజయ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను తొలి బంతి ఆడి ప్రారంభించిన ఎంపీ విజయ్, ఎంపీపీ పాఠశాల ప్లేగ్రౌండ్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.'గడప గడపకు' కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లిన ఎంపీ విజయ్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ చింతకాయల విజయ్ మాట్లాడుతూ నాతవరం ప్రజలు చూపించిన ఆదరణను జీవితాంతం మరువలేనన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో సొంత గడ్డపై సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టమని పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్న నారా లోకేష్ రాష్ట్ర భవిష్యత్తుకు కీలక నాయకుడని కొనియాడారు.తెలుగుదేశం పార్టీ మహిళల సంక్షేమానికి ఎప్పటి నుంచో పెద్దపీట వేస్తోందని పేర్కొన్న ఎంపీ విజయ్, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గత రెండేళ్లలో నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.532 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.568 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మొత్తం రూ.1,100 కోట్ల మేర ప్రజల కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు.



అలాగే 1,896 అభివృద్ధి పనులు పూర్తి చేశామని వెల్లడించారు.రానున్న రోజుల్లో నాతవరం మండలంతో పాటు నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చిన ఎంపీ విజయ్, పర్యటనను విజయవంతం చేసిన జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, మాజీ ఎంపీపీ లు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్, నాతవరం పిఏసిఎస్ అధ్యక్షులు అపిరెడ్డీ మాణిక్యం,గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షులు సంగంపల్లి సన్యాసి దేవుడు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## చలో పాడేరు ర్యాలీ విజయవంతం చెయ్యాలి.

నిరుద్యోగుల సంఘం కన్వీనర్ సత్యనారాయణ పడాల్.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 16.** రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయ జీవోను వెంటనే జారీ చేసి, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని నిరుద్యోగుల సంఘం కన్వీనర్ సాగిన సత్యనారాయణ పడాల్ డిమాండ్ చేశారు.

అలాగే, 1/70 చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. అదేవిధంగా అల్లూరి జిల్లాను జోన్--1లోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం (జూలై 17) ఉదయం 10 గంటల నుంచి పాడేరు జూనియర్ కళాశాల మైదానం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివాసుల హక్కులు, భవిష్యత్ తరాల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆదివాసులు, నిరుద్యోగ యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సిల్వర్ మొక్కల టెండర్లలో గిరిజనులకు ప్రధమ ప్రాధాన్యత ఇవ్వాలి.

- కలెక్టర్ ఆఫీసులో గిరిజన సిల్వర్ మొక్కల కాంట్రాక్టర్లు. ఆందోళన.
- అవకాశం కల్పిస్తామని ఐటిడిఎఫ్ఈఓ హామీ
- మొదటి ప్రాధాన్యత గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేసిన టిడిపి డివిజన్ నాయకులు పాండురంగ స్వామి:



**హుకుంపేట పెన్ పవర్ జూలై 16.** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం

అల్లూరి జిల్లా వ్యాప్తంగా జి రాంజీ ద్వారా గిరిజన రైతులకు ఇస్తున్న సిల్వర్ మొక్కల టెండర్లలో గిరిజనులకె మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆఫీస్ మీటింగ్ హాల్ వద్ద టీడీపీ డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి ఆందోళన చేశారు గిరిజన టెండర్ దారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా గిరిజనులకు ఆర్థిక భరోసా కల్పించాలని. ఆయన అన్నారు. ఐటిడిఏ పీఓ స్పందించాలి ఆదివాసులపై అధికారులు మొండి వైఖరి నశించాలి అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు అంతక ముందు డీఆర్ డీఏ పీడీ తో గిరిజన టెండర్ దారులకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వటం లేదు అని కాసేపు వాగ్వాదం జరిగింది కనీసం అప్లికేషన్ కూడా తీసుకోలేదని దుమా పీడీ పై వాగ్వాదం జరిగింది ఈలోపు పీఓ ఐటిడిఏ మీటింగ్ హాల్ కు వచ్చి టెండర్ లను ప్రారంభిస్తుండగా గిరిజన టెండర్ దారులకు న్యాయం చేయాలని గిరిజనుల గోడు పీఓ వినాలని ఆ తరువాతే టెండర్ ప్రక్రియ మొదలు పెట్టాలని పెద్దయెత్తునా నినాదాలు చేస్తూ ఆందోళన చెయ్యగా ఆందోళన కారుల వద్దకు పీఓ వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సిల్వర్ మొక్కల టెండర్లలో అనుమతి ఇస్తున్నామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు ఈ సందర్భంగా టిడిపి డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ జి రాంజీ ద్వారా గిరిజన రైతులకు ఇస్తున్న మొక్కల్లో గిరిజన టెండర్ దారులకు అవకాశం కల్పించాలని దర్శన గ్రీన్ సొసైటీ ట్రైబల్ గ్రీన్ సొసైటీ సర్సరి వారికి టెండర్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన నిరుద్యోగ యువతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన నిరుద్యోగుల పట్ల పక్షపాతం చూపించాడం విచారకరమని సిల్వర్ టెండర్లలో గిరిజన యువతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఐటిడిఏ పీఓ నీ కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జగ్రాయ్. వేచంగి కొండయ్య, లక్ష్మణ్, చిన్ని బాబు, సన్నిబాబు, మాజీ

## జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు మాతృవియోగం




అరకు వైఎస్సార్సీపీ నేతల పరామర్శ

**అరకులోయ పెన్ పవర్ 16:** ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కు మాతృవియోగం కలిగింది. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి మజ్జి కృష్ణవేణి (83) మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషాద వార్త తెలుసుకున్న అరకు నియోజకవర్గం వైఎస్సార్సీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.తెడబారికి సురేష్ కుమార్, ఎంపీటీసీ దురియా ఆనంద్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు పట్టాసి కొండలరావు, కొర్రా సల్మాన్ రాజు తదితరులు ఈరోజు మజ్జి శ్రీనివాసరావుకు పరామర్శించారు. ఈ సందర్భంగా దివంగత మజ్జి కృష్ణవేణి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు కు , వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. దివంగత మజ్జి కృష్ణవేణి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## 1/70 చట్టం అమలు కోసం పాడేరు గిరిజన శంఖారావానికి భారీగా తరలిరండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ పిలుపు

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 16:** 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న పాడేరు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'గిరిజన శంఖారావం' భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణ ప్రతి ఆదివాసి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. 1/70 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే జీవో నెం.3కు ప్రత్యామ్నాయంగా కొత్త ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసి, షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు శాతం వంద ఉద్యోగాలు లభించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగించాలని, షెడ్యూల్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాలలో స్థానిక ఆదివాసులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని కోరారు.గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు వివిధ సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జూలై 17 (శుక్రవారం) పాడేరు జిల్లా



కేంద్రంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభలో పార్టీలకు అతీతంగా గిరిజన ఉద్యోగులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బొబ్బిలి లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

## 400 కిలోల భారీ అక్రమ గంజాయి పట్టివేత



- గంజాయితో పాటు స్కోర్పియో వాహనాన్ని పోలీసులు స్వాధీనం.
- నిందితులు అరెస్ట్.
- జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు.
- స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ పి నాని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 16.** అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు పోలీసులు భారీ ఎత్తున అక్రమ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం లబ్బూరు జంక్షన్ వద్ద పోలీసులు మరియు రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిస్సా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్ నుండి కొరాపుట్ జిల్లా, జైపూర్ వైపు వెళ్తున్న ఒక స్కోర్పియో కార్ ను పోలీసులు నిలిపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కారులో 12 బస్తాలలో దాచిన 2కోట్ల విలువైన 400 కిలోల గంజాయిని గుర్తించి, గంజాయితో పాటు ఆ స్కోర్పియో వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గంజాయిని రవాణా చేస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అభిజిత్ మరియు ఘనశ్యామ్ అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాలో కీలక పాత్ర పోషించిన మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారు. పరారైన వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు గంజాయి సాగు మరియు రవాణాపై మేము ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. నేరస్తులు ఎంతటివారైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ పి నాని, పోలీస్ స్టేషన్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆస్తిత్వం ప్రమాదంలో పడింది

- నేడు పాడేరులో జరిగే మహాధర్నాకు గిరిజనులు తరలిరావాలి.
- షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొస్య తిరుపతి, వెంగడ నీలకంఠం.
- ఎన్ ఎస్ యుఐ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగడ జగన్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 16.** గిరిజనుల ఆస్తిత్వం ప్రమాదంలో పడిందని, గిరిజన చట్టాల పరిరక్షణకు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో నేడు జరగబోవు మహాధర్నను విజయవంతం చేయాలని షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొస్య తిరుపతి, వెంగడ నీలకంఠం, ఎన్ఎస్ యుఐ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగడ జగన్ లు ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా గురువారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ.. 1/70 చట్టం ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని, జివో నెంబర్ 3ను పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గిరిజనుల భూములు అన్యాక్రాంతం అవుతుందనీ, సుప్రీంకోర్టులో 1700 మంది 1/70 చట్టాన్ని వ్యతిరేకంగా దావా వేశారని, దీనిపై గిరిజనులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బినామీల పేరుతో గిరిజన భూములు అన్యాక్రాంతం అవుతుందనీ, గిరిజన చట్టాలను ఉల్లంగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనుల భూముల రక్షణ కోసం రూపొందించబడిన 1/70 చట్టం, జివో నెంబర్ 3పై ప్రతి గిరిజనుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాడేరులో జరిగే మహాధర్నాకు గిరిజనులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.


## గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- 1/70 చట్టం అమలుపై పూర్తి నిబద్ధత.. అసత్య ప్రచారాలను నమ్మొద్దు
- గిరిజనులు సందేహాలుంటే అధికారులను సంప్రదించాలి: కలెక్టర్ టి.నిషాంతి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 16:** షెడ్యూల్డ్ (ఏజెన్సీ) ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, భూములు, ఉపాధి అవకాశాలు, సంక్షేమాన్ని పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి తెలిపారు. గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.గురువారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా గిరిజనుల హక్కులు, ప్రయోజనాలకు ప్రత్యేక రక్షణ కల్పించబడిందని తెలిపారు. ఆ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అనేక చట్టాలు, విధానాలను అమలు చేస్తోందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూములను రక్షించేందుకు అమల్లో ఉన్న 1/70 భూ బదిలీ నియంత్రణ చట్టం అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం గిరిజనుల భూములు గిరిజనేతరులకు బదిలీ కాకుండా రక్షణ కల్పించబడుతుందని, అక్రమ భూ బదిలీలను నిరోధిస్తూ గిరిజనుల భూహక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందన్నారు.స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో గతంలో జి.ఓ. ఎంఎస్. నెం.3 జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ జి.ఓ. అమలులో మార్పులు వచ్చినప్పటికీ, గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ పట్ల ప్రభుత్వ సంకల్పంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. చట్టబద్ధమైన పరిధిలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.ఇటీవల కొందరు ఈ అంశాలపై అసత్య ప్రచారం చేస్తూ గిరిజనుల్లో ఆందోళన సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అలాంటి వదంతులను నమ్మవద్దని, చట్టాలు, ప్రభుత్వ విధానాలపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ప్రభుత్వ అధికారులను సంప్రదించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.గిరిజనుల హక్కులు, భూములు, విద్య, ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, 1/70 చట్టం ద్వారా కల్పించిన రక్షణలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం సంపూర్ణ కట్టుబడి ఉందని కలెక్టర్ టి. నిషాంతి భరోసా ఇచ్చారు. గిరిజనులు అపోహలు, అసత్య ప్రచారాలకు లోనుకాకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తూ, సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాలను మాత్రమే అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎంవీపీలో ఘనంగా జగన్నాథ రథయాత్ర



**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 16;**హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ జగన్నాథ రథయాత్ర గురువారం ఎంవీపీ కాలనీలో సంప్రదాయబద్ధంగా జరిగింది.డబల్ రోడ్ లోని ఐఐఏఎం కళాశాల వద్ద ప్రారంభమైన యాత్రను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి,హరే కృష్ణ మూవ్మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస్ తదితరులు ప్రారంభించారు.
ఇసుకతోట, వెంకోజీపాలెం, క్యాన్సర్ హాస్పిటల్,బీచ్ రోడ్ మీదుగా సాగిన రథయాత్రలో భక్తులు సంకీర్తనలు,కోలాటాలతో పాల్గొన్నారు.భరతనాట్యం, మంగళ హారతి నిర్వహించారు.అనంతరం భక్తులకు మహా ప్రసాదం పంపిణీ చేశారు.
కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# ఆరిలోవ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి 30 ఏళ్ల ప్రస్థానం





- 20 లక్షల మందికి ఓ పి వైద్య సేవలు
- కరోనా లో ఐదు లక్షల టెస్టులు,రెండు లక్షల వ్యాక్సిన్లు-విశాఖలో రెండవ స్థానంలో ఆరిలోవ ఎఫ్ ఆర్ యు
- 30వ వార్షికోత్సవ సందర్భంగా హాస్పటల్ డాక్టర్లు సిబ్బందికి శు భాకాంక్షలు తెలిపిన
- ఎమ్మెల్యే వెలగపూడి,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు బాల సతీష్.మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు.

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 16** జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరిలోవ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి ప్రజా సేవల్లో 30 ఏళు పూర్తి చేసుకుంది. 1996లో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేటికీ వారిలో ఒక పరిసర ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భరోసాగా నిలుస్తోంది.
30 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న ఆరిలోవ ఆసుపత్రి - 20 లక్షల మందికి ఓ పి సేవలు, 2 వేలకు పైగా సాధారణ కాన్పులు,30 ఏళ్లలో సాధించిన విజయాలు అనేకం ఉండగా
10,000 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు.
2015 నుంచి 2000 కు పైగా సాధారణ కాన్పులు చేయించారు.
20 లక్షలకు పైగా ఓ పి రోగులకు వైద్య సేవలు అందించారు
కరోనా సమయంలో 5 లక్షలకు పైగా కోవిడ్ టెస్టులునిర్వహించారు 2 లక్షలకు పైగా కోవిడ్ వ్యాక్సినేషన్ ఇచ్చి - విశాఖలో 2వ స్థానంలో నిలిచిందనీ వారిలో ఎఫ్ ఆర్ యు ఆవరణంలో హాస్పటల్ సిబ్బంది నిర్వహించిన 30 సంవత్సరాల వేడుకలలో భాగంగా నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన పై అంశాలను ప్రస్తావిస్తూ
. ఆరిలోవ ఎఫ్ ఆర్ యు 24/7 నిరంతర సేవలను అందిస్తోందనీ, ముందుగా హాస్పిటల్స్ సిబ్బందికి నిర్వాహకులకు పేరుపేరునా 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు.
ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటి కార్యక్రమం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్లు అనిత,రాగసుధ, ఆహ్వానితులను పూల బొకే అందించి చాలువాళ్ళతో సన్మానించి జ్ఞాపికలను అందించారు.
సేవలు అందిస్తున్నా, ఆసుపత్రిలో పనిచేస్తున్న 30 ఏళ్ల ఉద్యోగులకు ఇంకా ఉద్యోగ భద్రత లేదు. నెలవారీ జీతాలు కూడా ఆలస్యంగా వస్తున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
30 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని,నెలవారి జీతాల చెల్లింపు:ప్రతి నెలా సకాలంలో ఇవ్వాలనీ, ప్రభుత్వ నిర్వహణ: ఆసుపత్రిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా పూర్తిగా జీవీఎంసీ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని,
అధునాతన పరికరాలతో ఆసుపత్రిని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలనీ,
ప్రస్తుత సౌకర్యాలను పెంచి మరింత మంది రోగులకు సేవలు అందించాలనీ సిబ్బంది ప్రజాప్రతినిధులకు తెలియజేశారు.
20 లక్షల మందికి వైద్యం అందించి, కోవిడ్ సమయంలో విశాఖలో 2వ స్థానంలో నిలిచిన ఈ ఆసుపత్రిని ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని స్థానికులు, ఉద్యోగ సంఘాలు కోరుతున్నారు. ప్రజా సేవలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆరిలోవ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కాకి గంగరాజు, గాడి సత్యం , సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు సన్యాసిరావు. సన్యాసిరావు.ముది అప్పారావు.జ్యోతి టీడీపీ నాయకులు హాస్పిటల్స్ సిబ్బంది. ఆశ వర్కర్లు, వివిధ విభాగాల సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## అదానీ గూగుల్ డేటా సెంటర్ తో విశాఖ వినాశనం



- గూగుల్ డేటా సెంటర్ పై ప్రజా వ్యతిరేకతను పట్టించుకోని ప్రభుత్వం
- విశాఖ వినాశనానికి దారి తీస్తున్న ఆధాని గూగుల్ డేటా సెంటర్
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 16:** విశాఖపట్నంలో ఆరిలోవ, తరువాడ, పరదేశిపాలెం, ఋషికొండ, రాంబిల్లి ప్రాంతాల్లో అదానీ గూగుల్ డేటా సెంటర్లు పెట్టి విశాఖను వినాశనం చేయొద్దని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి లోకనాథం రాష్ట్ర టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వానికి హెచ్చరించారు.
ఆరిలోవ టిఐసి పాయింట్ జంక్షన్లో సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో జనావాసాల మధ్య గూగుల్ అదానీ డేటా సెంటర్ ఏర్పాటు చేయొద్దని భారీ బహిరంగ సభ జరిగింది. జోన్ కార్యదర్శి వి. కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో లోకనాథం ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ ఆరిలోవ విశాలమైన కొండలు, ముడసర్లోవ రిజర్వాయర్, చల్లటి వాతావరణం ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి మోడికి లొంగిపోయి అదానీ కంపెనీకి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 160 ఎకరాలు భూమిని కేటాయించడంపట్ల అసహనాన్ని వ్యక్తం చేసారు. ఈ ప్రాంతంలో నివశిస్తున్న వారంతా రోజువారీ కూలీలు, బడుగు, బలహీనవర్గాలకు చెందినవారని, శ్రీకాకుళం, విజయనగరం నుండి పొట్టచేతపట్టుకొని ఈ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే మెరుగైన జీవితాన్ని పొందుతున్నారన్నారు. ఈ ప్రజల నెత్తిన అదానీ డేటా సెంటర్ కుంపటి తెచ్చి పెట్టడం సరైందికాదని హెచ్చరించారు. అదానీ డేటా సెంటర్ కి ఈ నగరంలో ప్రజలు వినియోగించే నీరు, విద్యుత్ రోజుకు ఎంత అవసరం పడుతుందో అంత విద్యుత్ అవసరం. ఇప్పటికే విద్యుత్, త్రాగునీరు ప్రజలకు సరిపడా అందించలేని ప్రభుత్వం డేటా సెంటర్కు ఎక్కడ నుండి అందిస్తుందో తెలిపడం లేదన్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ లక్ష మందికి త్రాగునీరు అందిస్తుంది. ఈ రిజర్వాయర్ భవిష్యత్లో ఉండదని ఆందోళన వ్యక్తం చేసారు. లక్ష ఉద్యోగాలు, అభివృద్ధి అని చెప్పి ప్రభుత్వ భూములను, సహజవనరులను అడానికి కట్టబెట్టడాన్ని ఆయన దుయ్యబట్టారు. పేదల ఇళ్ళకు పట్టాలు, ఇళు ్ళలేని పేదలకు సెంటు స్థలం ఇవ్వడంలేదు. 275 సర్వే నెంబరులో ఉన్న వారికి, రామకృష్ణాపురం ప్రజలకు, పంచగ్రామాల ప్రజల పట్టాలు ఇవ్వనిరాకరిస్తున్న ప్రభుత్వం నేడు అదానీకి ఆఘమేఘాల మీద ఎలా భూమి, నీరు, విద్యుత్, పర్యావరణ అనుమతులు ఇస్తాదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రపంచంలో డేటా సెంటర్లు వద్దని తిరస్కరిస్తుంటే చంద్రబాబునాయుడు విశాఖకు ఆ డేటా సెంటర్లు తీసుకురావడం వెనుక అంతర్యమేమిటో తెలపాలన్నారు. ఈ డేటా సెంటర్కు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటానికి సిపిఎం ఎల్లప్పుడు అండగా ఉ ంటుందని భరోసా ఇచ్చారు.
సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మోడీ దగ్గర నుండి రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ వరకు విశాఖపట్నాన్ని అంతర్జాతీయ నగరంగా ఉనత్నమైన స్థానంలోకి తీసుకువెళ్తామని చెపుతున్నారు. లక్ష ఉద్యోగాలు వస్తాయని, అనుబంధ పరిశ్రమలు వస్తాయని తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేరవేస్తుందన్నారు. నూటికి 90 ఇళ్ళల్లో భార్య, భర్త, పిల్లలు కూలిపనులకు పోతున్న ప్రాంతమిది. చదువుకున్న పిల్లలకు శాశ్వత ఉద్యోగాలు లేవు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు అత్యధికంగా ఉన్న ఈ ప్రాంతంలో అదానీ డేటా సెంటర్ వస్తే మరింత ప్రమాదమన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రజలు అభివృద్ధి దిశగా ఉండటం లేదు. కార్పొరేట్ సంస్థలు లాభాల దిశగా ఈ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. దీనివలన ప్రజలకు ప్రయోజనం లేదని అన్నారు. ప్రజలకు హాని కలిగించే ఇటువంటి డేటా సెంటర్లను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి. మణి, జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, జోన్ నాయకులు పి.శంకరరావు, పి.వెంకటరావులు పాల్గొని ప్రసంగించారు. ఈ డి. కొండమ్మ, కె.కుమారి, బి. భారతి, డి.నాగరాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎం.వి. ప్రసాదరావు, జె.ఆర్. నాయుడు, ఆర్. రమణమ్మ, ఐసి నాయుడు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళి

- రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంతాప సభ
- మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ నివాళులర్పణ



**పెందుర్తి, పెన్ పవర్, జూలై 16 :** పెందుర్తి నియోజకవర్గం రాంపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపంగా గురువారం ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముద్రగడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల హక్కుల సాధన ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. జీవితాంతం సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేసిన మహోన్నత నాయకుడిగా ఆయనను కొనియాడారు. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి రాజకీయ, సామాజిక న్యాయం అందించాలనే లక్ష్యంతో ముద్రగడ చేసిన ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా ముద్రగడ పద్మనాభం అందరికీ ఆదర్శంగా నిలిచారని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అదీప్ రాజ్ అన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరిగే వరకు ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాస్, గండి రవికుమార్, రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు కోడిగుడ్ల దేవి సాంబ, సీనియర్ నాయకులు బొకం రాము, కోటన రాము, చుక్క రామునాయుడు, గొర్ల రామునాయుడు, పాలిశెట్టి సురేష్ రాజ్, చొప్ప నాగరాజు, ఐడి బాబు, మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు (సబ్బవరం), కొన రామారావు (పరవాడ), వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వర, వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు, మెంతి మహేష్, తమర్ల నర్సింగ్, అప్పికొండ మహాలక్ష్మీనాయుడు, గంద్రెడ్డి మహాలక్ష్మీనాయుడు, డాడీ ఉమ మహేష్, దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, పీతల విష్ణుమూర్తి, పెద్దిశెట్టి శేఖర్, పైలా అప్పలనాయుడు, బల్ల రాంబాబు, బోనీ నాయుడు, కోన శ్రీనివాస్, బొడ్డు ప్రకాశ్, నెబర్తి శ్రీను, యడ్ల నాయుడు, సేనాపతి దుర్గా, జతిన్ యాదవ్, అవగడ్డ శ్రీనివాస్, మహేష్, మువ్వల శ్రీను, కోయిలాడ శ్రీను, నక్క మహేష్, భాస్కర్, కర్రి సంతోష్, సన్ని, రామచంద్రరావు, అనితతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముద్రగడ పద్మనాభంకు ఘనంగా నివాళులర్పించారు.

# పాతగోపాలపట్నంలో భక్తి పారవశ్యంతో జగన్నాథ రథయాత్ర

- రథాన్ని లాగి యాత్ర ప్రారంభించిన ప్రభుత్వ విప్ గణబాబు
- ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 16 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 91వ వార్డు పాతగోపాలపట్నంలో శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీ.జీ.వి.ఆర్. నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముందుగా ఆలయంలో శ్రీ జగన్నాథ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గణబాబు, అనంతరం సంప్రదాయ పద్ధతిలో రథానికి పూజలు చేసి భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ రథయాత్రను ప్రారంభించారు. “జై జగన్నాథ” నినాదాలు, మంగళ వాయిద్యాలు, భజనలు, హరినామ సంకీర్తనలతో పాతగోపాలపట్నం ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే ఇటువంటి ఆధ్యాత్మిక ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ఆదరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రథయాత్ర మార్గమంతా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు హారతులు పట్టగా, యువకులు భక్తి గీతాలు ఆలపిస్తూ రథయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని జగన్నాథ స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయడంతో రథయాత్ర ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

# శ్రీ బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకున్న కోలీవుడ్ స్టార్ కమెడియన్ హీరో యోగి బాబు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 16.** ఆలయానికి విచ్చేసిన స్టార్ కమెడియన్ హీరో యోగిబాబు కి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే తనయులు జనసేన యూత్ ఐకాన్ బొలిశెట్టి రాజేష్ మరియు ఆలయ చైర్మన్ శ్రీరంగం రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆహ్వానం పలికారు.తమిళ్ మరియు తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రముఖ హాస్య నటుడు కోలీవుడ్ స్టార్ కమెడియన్ యోగిబాబు తాడేపల్లిగూడెం పట్టణ ఇలవేల్పు శ్రీ బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అమ్మవారి ప్రాముఖ్యత తెలియజేసి అమ్మవారి చిత్రపటాన్ని మరియు తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ శ్రీరంగం రామాంజనేయులు అందజేశారు. ఇటీవలే నాగ శౌర్య తో హిట్ కొట్టిన తాడేపల్లిగూడెం వాసి పవన్ భాసంశెట్టి దర్శకత్వంలో ఈయన నటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నారికి వైద్యసహాయం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి, జనసైనికులు



**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జూలై 16:** కంటి క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారి వైద్యం నిమిత్తం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులు రూ.20వేలు ఆర్థిక సహకారం అందించారు. జనసైనికులు రూ.1,30,000లు కలిపి మొత్తం రూ.1,51,000లు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత చిన్నారి కుటుంబానికి అందజేశారు. పడమర విప్పరు గ్రామానికి చెందిన పెనుమూలు ఏసు రాజు కుమార్తె 15 నెలల చిన్నారి పెనుమూలు నేహశ్రీ కి కంటి క్యాన్సర్ వైద్యం నిమిత్తం ఈ ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారి వైద్యం నిమిత్తం ఆర్థిక సహకారం అందించిన జనసైనికులను అభినందించారు. వివిధ రకాల సమస్యలతో బాధపడే ప్రజలకు సేవలు అందించే నిమిత్తం జనసేన కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రతి రోజూ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలకు నిరంతర సేవలు అందించే నిమిత్తం ఆరుగురు సిబ్బందిని నియమించామని తెలిపారు. జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు జన సైనికులు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. రాజకీయమంటే అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా జనసేన కృషి చేస్తుందని అన్నారు. చిన్నారి వైద్యానికి సహకారం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు, జనసైనికులకు పెనుమూలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమరవిప్పర్రు జనసేన నాయకులు, పెంటపాడు మండల జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి, గంటా సుబ్రహ్మణ్యం, పసల శ్రీకృష్ణ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిల్లి రాయుడు కుటుంబానికి జనసేన నాయకుడు తలపంటి బుజ్జి అండ....


50 కేజీల బియ్యం, ఆర్థిక సాయం అందించి కష్టకాలంలో బాధిత కుటుంబానికి భరోసా




**శంఖవరం పెన్ పవర్ జులై 16:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన సిల్లి రాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి పరామర్శించారు.సిల్లి సత్యవతి, నాని, తాతాబ్బాయి తదితర కుటుంబ సభ్యులను కలిసి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో తలపంటి వీరబాబు,పీర్ల నాని,సికోలు రాజబాబు, శివకోటి ప్రసాద్, చిట్టుమూరి కామరాజు, కానేటి అభి, కోరాడ జాను, రాచపల్లి శ్రీను,నొక్కి వీరబాబు, మద్దిల రాజబాబు, కోరాడ పెద్దబాబు, నెల్లిపూడి గ్రామ జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలు వేగవంతం చేయాలి

ఉద్యోగుల కేడర్ కేటాయింపులు గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ నిషాంతి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 16:** రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 ప్రకారం ఉద్యోగుల కేడర్ కేటాయింపు ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా కేడర్ నుంచి కొత్త జిల్లా, అనుబంధ జిల్లా, జోనల్, అనుబంధ జోనల్, మల్టీ జోనల్ కేడర్లకు ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను దశలవారీగా చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖలో కేడర్ బలం, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సంఖ్య, తుది కేడర్ బలాన్ని సమగ్రంగా పరిశీలించి వివరాలను ఖరారు చేయాలని ఆదేశించారు.రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలుకు ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా జూలై 16న ముసాయిదా సీనియారిటీ జాబితా విడుదల, ఆప్షన్ ఫారాల జారీ, జూలై 20లోగా అభ్యంతరాల స్వీకరణ, జూలై 22న తుది సీనియారిటీ జాబితా ప్రచురణ చేపట్టనున్నట్లు తెలిపారు.అదే రోజు నుంచి ఉద్యోగుల ఆప్షన్ల స్వీకరణ, సమాంతర ధ్రువీకరణ చేపట్టి జూలై 26లోగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జూలై 28న తుది కేటాయింపు జాబితా విడుదల చేసి కేటాయింపు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ప్రభావిత ఉద్యోగులను గుర్తించాలని, అనంతరం జూలై 30న కొత్త నియామక యూనిట్లలో రోస్టర్ల అమలు, రిక్విజిషన్ల తయారీ, చేరిక ఉత్తర్వుల జారీ పూర్తి చేసి ఆగస్టు 5లోగా కొత్త యూనిట్లలో ఉద్యోగుల చేరిక పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిశీలించి తుది జాబితా రూపొందించాలని, సర్వీస్ రిజిస్టర్లు, ఇతర ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఉద్యోగుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ఉద్యోగులు ఎవరూ సీనియారిటీ జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా చూడాలని, ఏ పోస్టు లేదా ఉద్యోగి కేటాయింపులు లేకుండా మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల అభ్యంతరాలు, ఆప్షన్ ఫారాలు, ప్రాధాన్యత కేటగిరీలకు సంబంధించిన క్లెయిమ్‌లను నిష్పక్షపాతంగా పరిశీలించి, కేడర్ వారీగా సీనియారిటీ, ఉద్యోగుల ఆప్షన్లు, అందుబాటులో ఉన్న ఖాళీలు, ప్రాధాన్యత కేటగిరీలను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు చేపట్టాలని తెలిపారు. ఉద్యోగులకు పూర్తి సమాచారం అందించి, అభ్యంతరాలను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలు ప్రక్రియను శాఖల మధ్య సమన్వయంతో, నిబంధనలకు లోబడి, పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, డీఆర్వో ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.






# ముద్రగడ మృతికి సంతాపం వ్యక్తం చేసిన వరసాల ప్రసాద్, గాజింగం సత్తిబాబు





**గోకవరం పెన్ పవర్ జులై 16:–** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు కాపు ఉద్యమ నేత అంబేద్కర్ అందరివాడు అంటూ వెలుగెత్తి చాటిన మహోన్నత విలువలు కలిగిన వ్యక్తి ముద్రగడ పద్మనాభం మరణం చాలా బాధాకరమని గోకవరం మండలం దళిత నాయకులు వరసాల ప్రసాద్ అన్నారు. గురువారం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్పర్సన్ గాజింగి సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాపు యువ నాయకుడు ముత్యం (వీర వెంకటరావు) నాని,మరో కాపుయువజన నాయకుడు పల్లెల రామకృష్ణ తో కలిసి కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామంలోని మాజీ మంత్రి ముద్రగడ స్వగృహానికి చేరుకుని ముద్రగడ పద్మనాభం కుమారుడు బాలును పరామర్శించారు అనంతరం పద్మనాభంతో వీరికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని కన్నీరు పెట్టుకున్నారు అనంతరం ముద్రగడ సమాధిని సందర్శించి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గాజింగి సత్తిబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా కాకినాడ పార్లమెంటు సభ్యునిగా నాలుగు పర్యాయాలు శాసనసభ్యునిగా తూర్పుగోదావరి జిల్లా కీర్తిని మరియు కాపు కులస్తులు సమాజంలో గౌరవం పొందేలా గుర్తింపు తీసుకువచ్చారని కాపులలో అణ గారిన వర్గాలు కూడా ఎంతో ఆర్థికంగా రాజకీయంగా అణిచివేతకు గురవుతున్న విషయాన్ని గ్రహించిన కాపు ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టి కాపులందరినీ మేల్కొల్పిన మహోన్నత వ్యక్తి అని అటువంటి వ్యక్తి నేడు లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ్డ పద్మనాభం కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ అధైర్య పడద్దని ఆంధ్రప్రదేశ్ అంతా మీ కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని వరసాల ప్రసాద్ గాజింగి సత్తిబాబు లు ముద్రగడ పద్మనాభం కుమారుడు బాలును ఓదార్చారు.

# దారేల, కొండపడలో ఘనంగా రథోత్సవాలు



**భక్తి, సమానత్వం, ఐక్యతకు ప్రతీక రథయాత్ర.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 16.** మండలంలో గల దారేల, కొండపడ గ్రామాలలో రథయాత్ర మహోత్సవం గురువారం ఘనంగా జరిగాయి. దారేల రథయాత్రలో పాల్గొన్న టిడిపి డివిజన్ నాయకులు పాండురంగ స్వామి మాట్లాడుతూ.. దారెలలో 1962 నుంచి ప్రతి ఏటా రథయాత్ర ఉత్సవం కొనసాగుతుందన్నారు. కొండపడలో పాల్గొన్న టిడిపి మండల కార్యదర్శి కొంతేరి జగన్నాయ్ మాట్లాడుతూ.. భారతదేశంలో అత్యంత ప్రాచీనమైన హిందూ పండుగలలో రథయాత్ర ఒకటన్నారు. రథయాత్ర భక్తి, సమానత్వం, ఐక్యతకు ప్రతికగా భావించబడుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో రథయాత్ర పూజరులు లోహితసు, మత్స్యరాజు, ఆనందరావు, దారెల ఎంపిటిసి మల్లికార్జున, దారేల మాజీ ఎంపిటిసి శాస్త్రి బాబు, జనసేన మండల అధ్యక్షులు శ్రావణ్ కుమార్, కూటమి నాయకులు సతీష్, చిన్ని బాబు, రామారావు, ప్రసాద్ పడాల్ తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలినినో ప్రభావం పై రైతులకు అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 16:** ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితులు, పంట సాగులో పాటించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏడీఏ గరిమెళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆత్మ పథకంలో రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిర్వాహణకు నిర్ణయం చేశామన్నారు. ఎల్ నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల వల్ల పంట సాగు ఇబ్బందులు రావచ్చని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రభుత్వం పంట భీమా సౌకర్యం కల్పించిందన్నారు. రైతులు పంట భీమా కోసం స్వీయ నిర్ధారణ చేసుకోవచ్చని అధికారుల చుట్టూ తిరగనవసరం లేదన్నారు. వరి ఎకరానికి రూ.760, పత్తికి రూ.2వేలు చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకుంటే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. జూలై 24వతేదీ వరకు గడువు ఉందన్నారు. సమావేశంలో ఆత్మ డీవీడీ కె.బాబురావు, జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్. నరసింహం, గండేల్లి, ఏలేశ్వరం ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పోలవరం జిల్లాలో ఘన స్వాగతం







- గండి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు
- పునరావాస పనుల పురోగతిని వివరించిన కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం /దేవీపట్నం, పెన్ పవర్, జూలై 16**: పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించేందుకు గురువారం పోలవరం జిల్లాకు విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తదితర ప్రజాప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా దేవీపట్నం మండలంలోని శ్రీ శ్రీ శ్రీ గండి పోచమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి సత్కరించారు.ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, నిర్వాసితుల పునరావాస కార్యక్రమాల పురోగతి, హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలను కలెక్టర్ కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రజలకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులు సమగ్ర సమాచారం అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపు నిర్వహణ



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 16;** ఎల్నోవా ప్రభావంతో వాతావరణ మార్పులు కారణంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీలుగుమిల్లి పిహెచ్సి సిహెచ్ఓ శ్రీనివాసరాజు సూచించారు. గురువారం దాట్లవారిగూడెం గ్రామంలో వైద్యాధికారి మణికంతేశ్వర ఆదేశాల మేరకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉపాధి హామీ కార్మికుల వద్దకు వెళ్లి సుమారు 72 మందికి పరీక్షించి జలుబు, దగ్గు ఉన్నవారికి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు రాపిడ్ టెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కురం ప్రసాదు, సిబ్బంది శ్రావణి, కృష్ణవేణి, జగదాంబ, నాగరత్నం, పార్వతి ,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్రానికి తీరని లోటు -- వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జూలై 16:** ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ముద్రగడ పద్మనాభం మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా, శాసనసభ్యుడిగా ఆయన నిర్వహించిన ప్రతి పదవికి తన నిజాయితీ, నిబద్ధత, ప్రజాసేవతో ప్రత్యేక వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. కాపు సామాజిక వర్గం హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమం కోసం ఆయన జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీపడని నాయకుడిగా, ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో విలువలు, నిబద్ధత, ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే నాయకుడని రఘురాం నాయుడు అన్నారు. ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# గ్రామ దేవత శ్రీ.శ్రీ.శ్రీ బలుసులమ్మ తల్లి శాకంబరి అలంకారంతో సుభిక్షం :ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్







**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జులై 16:**గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ బలుసులమ్మవారికి శాకంబరి అలంకరణతో సమాజం సుభిక్షంగా ఉంటుందని, ప్రతిఒక్కరూ శాకంబరి అలంకారాన్ని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే స్థానిక కార్యాలయంలో శ్రీ బలుసులమ్మ వారి ఆలయ నిర్వాహకులు శ్రీ రంగం అంజి బాబు, నీలం సురేష్ బృందం ఎమ్మెల్యేను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.జులై 17, శుక్రవారం రోజు శాకంబరి అలంకరణ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంకరణ కు సహకరించిన నీరుల్లి, కూరగాయల వర్తక సంఘాలవారిని అభినందించారు. హిందూ సంప్రదాయాల పరిరక్షణకు, సనాతన ధర్మాచరణకు శాఖంబరి అలంకరణ వంటి ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. అమ్మవారి ఆలయంలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, సమాజ క్షేమం కోసం కృషి చేయాలని ఆలయ నిర్వహకులను కోరారు.

# పర్మిషన్ 33 చెట్లకు, నరికింది 51 చెట్లు

- చోద్యం చూస్తున్న అటవీ శాఖ సిబ్బంది
- డి ఎఫ్ ఓ, స్క్వాడ్ తనిఖీలు
- ఎవరెవరిపై వేటు పడనుందో?





**వై రామవరం,పెన్ పవర్,జూలై 16** : జిల్లా స్థాయి అధికారులు అనుమతితో పట్టా భూమిలో ఉన్న 33 మారుజాతి కలప చెట్లు నరుకుటకు అనుమతించగా, 51 చెట్లు నరికారని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

మండలంలో యార్లగడ్డ పంచాయతీ గౌరమంద గ్రామంలో వై రామవరం సెక్షన్, వై. రామవరం బీటులో గిరిజన రైతు పట్టా భూమిలో ఉన్న చెట్లను తొలగించుటకు కలెక్టర్ పర్మిషన్ ఇచ్చారని, చెట్లను నరుకుటకు అటవీ శాఖ అనుమతి ఇచ్చామని అడ్డతీగల సబ్ డి ఎఫ్ ఓ సుబ్బారెడ్డి తెలిపారు. పర్మిషన్ ఇచ్చిన చెట్ల కన్నా 18 చెట్లు ఎక్కువ నరికారని, దీనిపై డిఎఫ్ఓ, అటవీ శాఖ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారని తెలిపారు. దీనిపై సిబ్బంది నిర్లక్ష్యం కాన వస్తుందని ఆయన అన్నారు. అధికారులు ఎంక్వయిరీ రిపోర్ట్ వ్రాసుకుని వెళ్లారని తెలిపారు. రిపోర్ట్ అందిన తర్వాత ఎవరెవరిపై చర్యలు తీసుకున్నారో తెలుస్తుందని సిబ్బంది తెలిపారు.

# డిగ్రీ కాలేజ్ లెక్చరర్ గా దుంపల. అయ్యప్ప...



**అడ్డతీగల,పెన్ పవర్, జూలై 16;** అడ్డతీగల గురుకుల పాఠశాలలో ప్రస్తుతం ఉపాధ్యాయుడు గా విధులు నిర్వహిస్తున్న దుంపల. అయ్యప్ప ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన డిగ్రీ కాలేజీ లెక్చరర్ల ఎంపిక పోటీ పరీక్షల్లో జోన్-1 పరిధిలో ఎకనామిక్స్ లెక్చరర్ గా విజయం సాధించారు. ఈయన సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి ఈయన పాఠశాల విద్యాభ్యాసం నుండి యూనివర్సిటీ స్థాయి వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివి ఇంతటి ఘనత సాధించడం విశేషం, ఇంతటి విజయాన్ని సాధించిన అయ్యప్పను తోటి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ప్రభాకర్ అభినందించారు.ం

## ముఖ్యమంత్రి పర్యటన పేరుతో హడావుడి పనులు కాదు..

- పోలవరం జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపాలి
- సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ డిమాండ్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 16**: ఈ నెల 22న ముఖ్యమంత్రి రంపచోడవరం పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న తాత్కాలిక పనులను నిలిపివేసి, నూతన పోలవరం జిల్లా శాశ్వత అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన పేరుతో రాత్రికి రాత్రే రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేయడం, రంగులు వేయడం వంటి హడావుడి పనులు కాకుండా, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని కోరారు.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల అమలు, పునరావాస కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన ఇప్పటికీ పూర్తి కాలేదని పేర్కొన్నారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, మెరుగైన వైద్య సేవలు ఇంకా అందుబాటులో లేవని, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కొరతతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో, ఏజెన్సీ ప్రాంత విద్యాసంస్థల అభివృద్ధిలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ముఖ్యమంత్రి పర్యటనను కేవలం ప్రచార కార్యక్రమంగా పరిమితం చేయకుండా, పోలవరం జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించి శాశ్వత పనులు చేపట్టాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com